www.prajasakti.com

ప్రజాశక్తి

శుక్రవారం 17 మే 2024

5

ఏలూరు

రైతుల ఖాతాల్లో రూ.225.67 కోట్లు జమ : జెసి

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలో రబీ పంట కాలం 2023-24కు సంబంధించి 2,40,000 అలాట్మెంట్‌కు ఇప్పటివరకు 2,15,957.200 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని విక్రయించేందుకు నమోదు చేసుకోగా 1,97,129.920 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ఆన్‌లైన్ ద్వారా కొనుగోలు చేసి అనుసంధానం చేసిన రైస్ మిల్లులకు ర్యాండమ్ సెలెక్షన్ ద్వారా తరలించినట్లు జాయింట్ కలెక్టర్ లావణ్యవేణి తెలిపారు. రూ.423.76 కోట్లకు రూ.225.67 కోట్లు రైతుల వ్యక్తిగత ఖాతాలో జమ చేసినట్లు చెప్పారు. కోతలు పూర్తయి విక్రయించేందుకు సిద్ధంగా ఉన్న ధాన్యాన్ని ప్రభుత్వం వారిచే నిర్దేశించిన అన్ని నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా సిద్ధం చేసుకోవాలని రైతులకు చెప్పారు. గోనెసంచులు, రవాణ వాహనాలు సమకూర్చి కనీస మద్దతు ధర క్వింటాలుకు కామన్ రకానికి రూ.2183, గ్రేడ్-ఎ రకానికి రూ.2203 బయోమెట్రిక్ విధానంలో కొనుగోలు చేసి రైస్‌మిల్లుకు తరలించేందుకు తగిన చర్య తీసుకోనున్నట్లు తెలిపారు.

ఆధునికీకరణకు పాతర..!

డెల్టాలో కాలువల పరిస్థితి దారుణం

పూడుకుపోవడంతో దిగువకు పారని నీరు

ఈ ఏడాదీ చిల్లిగవ్వ పనులు చేపట్టని వైనం

ఆధునికీకరణ పనులకు తిలోదకాలిచ్చిన వైసిపి సర్కార్

ప్రతియేటా సాగునీటి కోసం రైతుల అగచాట్లు

గుర్రపు డెక్కతో నిండిపోయిన ఉండి ప్రధాన కాల్వ

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ప్రభుత్వం డెల్టా ఆధునికీకరణకు పూర్తిగా పాతరేసింది. దీంతో గడిచిన ఐదేళ్లుగా జిల్లా రైతాంగం పడుతున్న అవస్థలు వర్ణనాతీతం. ఈ ఏడాది వేసవిలో సైతం చిల్లిగవ్వ పని చేయకుండా చేతులెత్తేసిన పరిస్థితి. పాలకుల నిర్లక్ష్యంతో ప్రతియేటా వేలాది ఎకరాల్లో పంట దెబ్బతింటోంది. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 48 మండలాలు ఉండగా 29 మండలాల్లో డెల్టా ప్రాంతం విస్తరించి ఉంది. గోదావరి నుంచి 11 ప్రధాన కాలువలు, 300కుపైగా పిల్ల కాలువల ద్వారా పంటలకు సాగునీటి సరఫరా జరుగుతోంది. ఉమ్మడి జిల్లాలో డెల్టా పరిధిలో మొత్తం 5.29 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. దీనిలో 4.60 లక్షల ఎకరాలు వరి విస్తీర్ణం ఉండగా, మిగిలిన భూముల్లో చేపల చెరువులు, ఉద్యాన పంటలు ఉన్నాయి. గోదావరి డెల్టా పరిధిలో ఖరీఫ్, రబీలో సైతం వరిసాగు తప్ప రైతులకు వేరే ప్రత్యామ్నాయం లేకుండాపోయింది. 2007లో జిల్లాలో డెల్టా ఆధునికీకరణకు రూ.1,464 కోట్లు ప్రభుత్వం కేటాయించింది. దశాబ్దన్నర కాలం గడిచినా ఇప్పటికీ డెల్టా ఆధునికీకరణ పనులు పూర్తికాని దుస్థితి నెలకొంది. ఇప్పటి వరకూ రూ.800 కోట్లు మేర పనులు జరిగాయి. ఇంకా దాదాపు రూ.600 కోట్లు విలువ చేసే పనులు జరగాల్సి ఉంది. చేసిన పనుల్లో సైతం నాణ్యత కొరవడిందనే ఆరోపణలు ఉన్నాయి. ఎక్కడికక్కడే కాలువలు మెరకదేరిపోయాయి. షట్టర్లు దెబ్బతిన్నాయి. అయినప్పటికీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. కాలువలు మెరకదేరడంతో సాగునీరు దిగువకు పారడం లేదు. దీంతో ఉండి, నరసాపురం వంటి ప్రాంతాల్లో రైతులు సాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత ప్రభుత్వాల హయాంలో ప్రతియేటా కొన్ని పనులైనా జరిగేవి. వైసిపి ప్రభుత్వం వచ్చాక డెల్టా ఆధునికీకరణ పనులను పూర్తిగా పక్కన పెట్టేసింది. కాలువల నుంచి తట్ట మట్టి తీసిన దాఖలాల్లేవు. నవంబర్‌లో జరిగే జిల్లా సాగునీటి సలహా మండలి సమావేశాల్లో డెల్టా ఆధునికీకరణ గురించి మంత్రులు, అధికారులు ఉపన్యాసాలు ఇవ్వడంతోనే సరిపోయింది. డిసెంబర్ నెలాఖరుకు ప్రతిపాదనలు తయారు చేసి జనవరి నెలాఖరుకు టెండర్లు పూర్తి చేయాలని, కాలువలు మూసిన వెంటనే పనులు ప్రారంభించాలని సమావేశాల్లో ఊదరగొట్టేవారు. ఇరిగేషన్ అధికారులు ప్రతియేటా రూ.300 కోట్ల విలువ చేసే పనులకు ప్రతిపాదనలు పంపినా ఒక్కసారి కూడా ప్రభుత్వం ఆమోదించిన పరిస్థితి లేదు. ఈ ఏడాది సైతం ఆధునికీకరణ పనులకు సంబంధించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించినా ఆమోదం లభించలేదు. దీంతో ఆధునికీకరణ పనులు ఎక్కడా జరగకుండా పోయాయి. ఈ ఏడాది వర్షాలు లేకుండా ఆధునికీకరణ పనులకు అనుకూల వాతావరణం ఉన్నప్పటికీ పనులు మాత్రం జరగని పరిస్థితి ఉంది.

ప్రతియేటా వేలాది ఎకరాల్లో దెబ్బతింటున్న పంటలు

ఆధునికీకరణ లేక కాలువలు మెరకదేరిపోవడంతో ప్రతియేటా వేలాది ఎకరాల్లో పంట దెబ్బతింటోంది. చిన్నపాటి వర్షాలకు సైతం పొలాల నుంచి నీరు కిందకు పారడం లేదు. దీంతో నారుమడులు దెబ్బతినడం ప్రతియేటా పరిపాటిగా మారింది. మాసూళ్ల కాలంలో అకాల వర్షాలతో పొలాల్లో వర్షపు నీరు నిల్వ ఉండిపోయి వేలాది ఎకరాల్లో పంట దెబ్బతింటోంది. రబీలో ప్రతియేటా నీటిఎద్దడి తలెత్తడం, వంతులవారీ విధానంలో నీటి పంపిణీ సాగుతోంది. కాలువలు పూడుకుపోయి సాగునీరు దిగువన ఉన్న పొలాలకు అందక రైతులు మోటారు ఇంజిన్లు, ఇతర వాటిపై ఆధారపడాల్సిన దుస్థితి దాపురించింది. డెల్టా ఆధునికీకరణపై పాలకులు వ్యవహరిస్తున్న తీరుపై జిల్లా రైతాంగంలో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది.

ఎపి ఇఎపి సెట్ పరీక్షలు ప్రారంభం

హాల్‌టిక్కెట్లు తనిఖీ చేస్తున్న సిబ్బంది

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే ఎపి ఇఎపి సెట్ పరీక్షలు గురువారం ప్రారంభమయ్యాయి. ఈ నెల 23 వరకు జరగనున్న ఈ పరీక్షల్లో గురు, శుక్రవారాల్లో అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సులకు, 18వ తేదీ నుంచి 23వ తేదీ వరకు ఇంజినీరింగ్ కోర్సుల్లో ప్రవేశాలకు పరీక్షలు జరగనున్నాయి. ఏలూరులో సిఆర్‌రెడ్డి ఇంజినీరింగ్ కళాశాల, ఏలూరు ఇంజినీరింగ్ కళాశాల, వట్లూరులోని సిద్ధార్థ క్వెస్ట్ కళాశాలలో గురువారం నిర్వహించిన పరీక్షలు ప్రశాంతంగా సాగాయి. సిఆర్‌రెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో ఉదయం తొమ్మిది గంటల నుంచి 12 గంటల వరకు జరిగిన పరీక్షకు 160 మందికి 151 మంది హాజరవ్వగా తొమ్మిది మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం 2.30 గంటల నుంచి 5:30 గంటల వరకు జరిగిన పరీక్షకు 159 మందికి 144 మంది హాజరవ్వగా 15 మంది గైర్హాజరయ్యారు. ఏలూరు ఇంజినీరింగ్ కళాశాలలో ఉదయం 140 మందికి 133 మంది హాజరవ్వగా ఏడుగురు గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం 139 మందికి 128 మంది హాజరవ్వగా 11 మంది గైర్హాజరయ్యారు. సిద్ధార్థ క్వెస్ట్ కళాశాలలో ఉదయం 180 మందికి 162 మంది హాజరవ్వగా 18 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం 180 మందికి 170 మంది హాజరవ్వగా పది మంది గైర్హాజరయ్యారు. మొత్తం మీద పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి.

24 నుంచి పది, ఇంటర్ అడ్వాన్స్ సప్లిమెంటరీ

ఏర్పాట్లపై డిఆర్ఒ పుష్పమణి సమీక్ష

ప్రజాశక్తి - ఏలూరు

ఇంటర్మీడియట్, పదో తరగతి అడ్వాన్స్ సప్లిమెంటరీ పబ్లిక్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని డిఆర్ఒ డి.పుష్పమణి సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక కలెక్టరేట్‌లోని డిఆర్ఒ ఛాంబర్‌లో ఇంటర్, పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లపై పరీక్షల కమిటీ సభ్యులు, వివిధ శాఖల అధికారులతో ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఆర్ఒ మాట్లాడుతూ ఈ నెల 24 నుంచి ఇంటర్, పదోతరగతి సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభమవుతాయని తెలిపారు. పరీక్షలు జూన్ ఒకటో తేదీ వరకూ జరుగుతాయని, ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు, ద్వితీయ సంవత్సరం మధ్యాహ్నం 2.30 గంటల నుండి సాయంత్రం 5.30 గంటల వరకు జరుతాయని తెలిపారు. జిల్లాలో 27 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామని, వీటిలో మొదటి, రెండో సంవత్సరానికి సంబంధించి మొత్తం 12,797 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కానున్నారని తెలిపారు. మొదటి సంవత్సరం జనరల్ కింద 7,744 మంది, ఒకేషనల్ కింద 920 మంది, మొత్తం 8,664 మంది విద్యార్థులు హాజరు కానున్నారన్నారు. రెండో సంవత్సరం జనరల్ కింద 3209 మంది, ఒకేషనల్ కింద 924 మంది మొత్తం 4,133 మంది విద్యార్థులు హాజరుకానున్నట్లు తెలిపారు. జూన్ 6న ఎథిక్స్ అండ్ హ్యూమన్ వాల్యూస్ పరీక్ష, 7న ఎన్విరాన్మెంటల్ ఎడ్యుకేషన్ పరీక్షలు జరుగుతాయని, ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు 124 సెంటర్లలో 12,797 మంది విద్యార్థులు హాజరుకానున్నారని తెలిపారు. ఈ పరీక్షలను ఇంటర్ విద్యార్థులు తప్పనిసరిగా రాయాల్సి ఉంటుందన్నారు. ఈ పరీక్షల నిర్వహణకు ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రయివేట్, అన్ ఎయిడెడ్, ఉన్నత పాఠశాలలను పరీక్షా కేంద్రాలుగా ఎంపిక చేశామని తెలిపారు. పదో తరగతి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు ఈ నెల 24 నుండి జూన్ మూడో తేదీ వరకు ఉదయం 9.30 నుండి మధ్యాహ్నం 12.45 గంటల వరకు జరుగుతాయని తెలిపారు. ఈ పరీక్షలకు 11,533 మంది విద్యార్థులు హాజరవుతారని, వీరిలో బాలురు 6970 మంది, బాలికలు 4563 మంది ఉన్నారని తెలిపారు. ఈ పరీక్షల నిర్వహణకు జిల్లాలో 50 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతి పరీక్షా కేంద్రంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, నిరంతర పర్యవేక్షణ జరపాలని ఆదేశించారు. పరీక్షలు రాసే విద్యార్థులు కేంద్రాలకు పరీక్షా సమయానికి కంటే ఒక గంట ముందు హాజరుకావాలని సూచించారు. విద్యార్థులు హాల్‌టిక్కెట్‌తోపాటు, గుర్తింపు కార్డు తప్పనిసరిగా తీసుకెళ్లాలని సూచించారు. పరీక్షా కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించి, వైద్య శిబిరాలు కూడా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేసి, వాటి పరిసర ప్రాంతాల కంప్యూటర్, జిరాక్స్ సెంటర్లను మూసివేయించాలని ఆదేశించారు. పరీక్షల రోజుల్లో విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా పరీక్ష సమయానికి అనువుగా బస్సుల సమయాలను రీషెడ్యూల్ చేసి నడపాలని ఆర్‌టిసి అధికారులకు సూచించారు. ఫ్లయింగ్ స్క్వాడ్ టీములను వెంటనే ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సమావేశంలో డివిఇఒ, డిఇసి కన్వీనర్ బి.ప్రభాకరరావు, డిఇఒ అబ్రహాం, ఎంహెచ్ఒ మాలతి, పోలీసు, విద్యుత్, మెడికల్, ఆర్‌టిసి, పోస్టల్, హెల్త్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

27న కందుకూరి సమాలోచన సదస్సు

105వ వర్ధంతి సందర్భంగా 105కుపైగా సంఘాల ఆధ్వర్యాన పలు కార్యక్రమాలు



బ్రోచర్, ఫ్లెక్సీ ఆవిష్కరించిన సంఘాల నేతలు

ప్రజాశక్తి - ఏలూరు

ఈ నెల 27న కందుకూరి వీరేశలింగం 105వ వర్ధంతిని పురస్కరించుకుని 105కుపైగా సంఘాల ఆధ్వర్యంలో కందుకూరి వర్ధంతి సమాలోచన నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. స్థానిక పవర్‌పేటలోని అన్నే భవనంలో కందుకూరి వర్ధంతి సమాలోచన కార్యక్రమ సన్నాహక సమావేశం గురువారం జరిగింది. సమావేశానికి ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం కార్యదర్శి గుడిపాటి నరసింహారావు స్వాగతం పలికారు. హేలాపురి బాలోత్సవం ఆహ్వాన సంఘ ప్రధాన కార్యదర్శి విజిఎంవిఆర్.కృష్ణారావు అధ్యక్షత వహించారు. 27వ తేదీ ఉదయం తొమ్మిది గంటల నుండి సిఆర్‌రెడ్డి కళాశాల ఆడిటోరియంలో సాంస్కృతిక కార్యక్రమాలు, సమాలోచన సదస్సు, పుస్తకావిష్కరణ, పుస్తక ప్రదర్శనలు చాట్స్ ఎడ్యుకేషన్‌తో కందుకూరి వర్ధంతి కార్యక్రమం నిర్వహించాలని సమావేశం నిర్ణయించింది. ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం కార్యదర్శి గుడిపాటి నరసింహారావు మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి కృష్ణా, గుంటూరు జిల్లాల ఎంఎల్‌సి కెఎస్.లక్ష్మణరావు ముఖ్యఅతిథిగా విచ్చేస్తారని, అతిథులుగా సర్ సిఆర్‌రెడ్డి విద్యాసంస్థల కార్యదర్శి డాక్టర్ ఎంబిఎస్‌వి.ప్రసాద్, సిఆర్‌ఆర్ డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ కెవి.విష్ణు మోహన్ హాజరవుతారని చెప్పారు. కందుకూరి జీవితంపై డాక్టర్ కె.అరుణ, డాక్టర్ బి.ఇమ్మానియేల్, డాక్టర్ లంకా వెంకటేశ్వర్లు, వొరప్రసాద్, సంకు మనోరమ మాట్లాడతారని తెలిపారు. ఈ సందర్భంగా కందుకూరి జీవితంపై ఫొటో ఎగ్జిబిషన్ ఉంటుందని, కందుకూరి జీవితం, కృషికి సంబంధించిన పుస్తకాల ఆవిష్కరణలు, జనవిజ్ఞాన వేదిక, ప్రజాశక్తి బుక్‌హౌస్ ముద్రించిన సాహిత్య ప్రదర్శన, కందుకూరి జీవితంపై ఫొటో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయబోతున్నట్లు వివరించారు. మానవత జిల్లా విద్యానిధి ఛైర్మన్ ఆలపాటి నాగేశ్వరరావు మాట్లాడుతూ ఏలూరులో ఉన్నటువంటి వివిధ సామాజిక, ప్రజా సాంస్కృతిక సంఘాలన్నీ కలిసి ఒకే వేదిక మీదకు తీసుకొచ్చేందుకు చేస్తున్న ఈ ప్రయత్నాన్ని అందరూ ఆదరించాలని కోరారు. 105కు పైగా సంఘాలు కందుకూరి 105వ వర్ధంతి కార్యక్రమ నిర్వహణకు ముందుకు రావడం సంతోషదాయకమన్నారు. ఇప్పటికే సంప్రదించిన సంఘాలు మాత్రమే కాకుండా ఇతరులు కూడా కలిసి రావాలని కోరారు. ఎఐటియుసి నాయకులు బండి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కందుకూరి వీరేశలింగం జీవిత చరిత్రను, ఆయన చూపిన మార్గాన్ని స్మరించుకుంటూ ఏలూరులో కార్యక్రమం చేపట్టడం హర్షణీయమన్నారు. కార్యక్రమ నిర్వహణకు వివిధ కమిటీలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కందుకూరి 105వ వర్ధంతి బ్రోచర్లు, ఫ్లెక్సీలను ఆవిష్కరించారు. సమావేశంలో వివిధ సంఘాలకు చెందిన వి.సురేష్, మేతర అజయ్ బాబు, పి.ఆంజనేయులు, ఎస్‌వి.సుబ్రహ్మణ్యం, శ్రీహరికోటి, కె.శ్రావణికుమారి, పి.సూర్యప్రకాష్, డి.గణేష్, వి.ఆదినారాయణ, కె.శ్రీనివాసరావు, మిల్టన్, కె.లెనిన్, అంకిత, లక్ష్మి, అవంతి, బిందు, లహరి, వాసవి, అంకిత, సాదిక్ పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే డెంగీ నివారణ

హెల్త్, వెల్‌నెస్ సెంటర్ జిల్లా నోడల్ అధికారి డాక్టర్ పూర్ణచంద్రరావు

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

ప్రజలందరూ పరిసరాల పరిశుభ్రత పాటించడం ద్వారా డెంగీ రహిత సమాజం స్థాపించడం పెద్ద కష్టమేమీ కాదని ఏలూరు జిల్లా హెల్త్, వెల్‌నెస్ సెంటర్ జిల్లా నోడల్ అధికారి డాక్టర్ పూర్ణచంద్రరావు సూచించారు. జాతీయ డెంగీ దినోత్సవ కార్యక్రమంలో భాగంగా స్థానిక ఏలూరు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి వారి కార్యాలయంలో ఆరోగ్య కార్యకర్తలకు, ఆశా కార్యకర్తలకు అవగాహన కల్పించారు. డెంగీ జ్వర కారక దోమ మంచినీటి నిల్వ ప్రాంతాల్లో పెరుగుతుందన్నారు. ప్రజలందరూ వారానికోసారి ఫ్రైడే డ్రైడే ఆచరించాలని, తీవ్రమైన జ్వరం, కండరాల నొప్పులు, కనుగుడ్ల నొప్పులు తదితర లక్షణాలతో బాధ పడుతుంటే డెంగీ జ్వరం కావచ్చని గుర్తించాలన్నారు. అశ్రద్ధ చేయకుండా దగ్గరలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించాలని, డెంగీ పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తారని తెలిపారు. అనంతరం అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ (ఎఒ)మురళీకృష్ణ మాట్లాడుతూ సిబ్బంది అంకితభావంతో పనిచేసి డెంగీ నిర్మూలనలో కీలక భాగస్వామి కావాలని సూచించారు. అసిస్టెంట్ మలేరియా అధికారి జె.గోవిందరావు మాట్లాడుతూ ప్రపంచంలో దాదాపు 110 దేశాల్లో డెంగీ వ్యాధి విస్తరించి ఉందని 85 శాతం వ్యాధిగ్రస్తులు సాధారణ చికిత్స ద్వారా కోలుకుంటారని తెలిపారు. డెంగీ దోమ మూత లేని తొట్లు, డ్రమ్ములు, ఓవర్ హెడ్ ట్యాంకులు, ఫ్రిజ్ వెనుక బాక్స్, ఎయిర్ కూలర్స్, ఫ్లవర్ వాసులు, పూల కుండీలు, రుబ్బురోలు, గ్రైండర్స్, టైర్లు, వాడేసిన కొబ్బరి బొండాలు, పల్లపు మంచినీటి నిల్వ ప్రాంతాలు మొదలు స్థలాల్లో పెరుగుతాయని తెలిపారు. తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. డెమో నాగరత్నం మాట్లాడుతూ డెంగీ జ్వరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, అశ్రద్ధ చేస్తే ప్రాణాపాయమని సూచించారు. ఈ కార్యక్రమంలో డిపిహెచ్ఎన్ఒ జ్యోతి, హెల్త్ ఎడ్యుకేటర్ విజయ్, ఎంపిహెచ్ఇఒ రవికుమార్, చిత్తా శ్రీనివాస్, హెల్త్ సూపర్‌వైజర్ నాగమల్లేశ్వరరావు, హెల్త్ అసిస్టెంట్ మేక శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కస్టడీలో ఉన్న నిందితుడిని తీసుకెళ్లిన

చింతమనేనిని అరెస్ట్ చేయాలి

పోలీస్ స్టేషన్ ఎదుట వైసిపి నాయకులు, కార్యకర్తల ధర్నా

పోలీస్ అధికారుల హామీతో విరమణ



రోడ్డుపై బైఠాయించి ధర్నా చేస్తున్న వైసిపి నాయకులు

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

పెదవేగి పోలీస్‌స్టేషన్ కస్టడీలో ఉన్న నిందితుడు అపహరణపై వైసిపి నాయకులు, కార్యకర్తలు పోలీస్ స్టేషన్ వద్ద గురువారం ధర్నా చేశారు. నిందితుడి అపహరణకు పాల్పడిన చింతమనేనిని, ఆయన అనుచరులను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. చింతమనేని డౌన్ డౌన్, చింతమనేనిని అరెస్ట్ చేయాలి, చింతమనేని దౌర్జన్యం నశించాలంటూ నినాదాలు చేశారు. పెదవేగి-కూచింపూడి ప్రధాన రహదారిపై గంటకు పైగా బైఠాయించి ధర్నా చేశారు. ఈ నెల 13వ తేదీన జరిగిన ఎన్నికల్లో పెదవేగి మండలం కొప్పులవారిగూడెం పోలింగ్‌బూత్ వద్ద గ్రామ సర్పంచి చలపాటి సంజీవరావు చిన్న కుమారుడికి అదే గ్రామానికి చెందిన తాళ్లూరి రాజశేఖర్ అనే టిడిపి కార్యకర్తకు మధ్య వివాదం ఏర్పడింది. ఒకరినొకరు తోసుకున్న ఘటనలో రాజశేఖర్ అక్కడే ఉన్న మెడికల్ వైద్య శిబిరంలో ట్యాబ్‌లెట్ షీట్లు కత్తిరించడానికి ఉపయోగించే కత్తెరతో సర్పంచి చిన్న కుమారుడు మెడ వెనుక భాగంలో పొడవడంతో తీవ్ర గాయాలయ్యాయి. దీంతో రాజశేఖర్‌పై పెదవేగి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. నిందితుడు రాజశేఖర్‌ని పోలీసులు గురువారం అరెస్ట్ చేసి స్టేషన్‌కి తీసుకొచ్చారు. ఈ విషయం తెలుసుకున్న టిడిపి శ్రేణులు పోలీస్ స్టేషన్‌లో పోలీస్ కస్టడీలో ఉన్న నిందితుడు రాజశేఖర్‌ని స్టేషన్ ఎస్ఐ, సిఐలు అడ్డుపడినా ఖాతరు చేయకుండా దౌర్జన్యంగా కారులో ఎక్కించుకుని వెళ్లిపోవడంతో విషయం తెలుసుకున్న వైసిపి శ్రేణులు చింతమనేనిని, ఆయన అనుచరులను వెంటనే అరెస్టు చేయాలని పెదవేగి పోలీస్ స్టేషన్ ముందు రోడ్డుపై ధర్నా చేశారు. పోలీస్ అధికారులు పెదవేగి చేరుకుని పోలీస్ కస్టడీలో ఉన్న నిందుతుడిని తీసుకెళ్లిన వారి పై కేసులు నమోదు చేసి వారితో పాటు నిందితుడు రాజశేఖర్‌ని కూడా అరెస్ట్ చేసి స్టేషన్‌కి తీసుకొస్తామని ధర్నాలో పాల్గొన్న వైసిపి శ్రేణులకు హామీ ఇవ్వడంతో వారు ధర్నాను విరమించారు.

డయేరియా మృతుని కుటుంబానికి పిఒ పరామర్శ



మృతురాలి వివరాలు తెలుసుకుంటున్న పిఒ

ప్రజాశక్తి - ఏలూరు/కుక్కునూరు

కుక్కునూరు మండలంలోని దామర్లచర్ల పంచాయతీ కుదుములతోబులో డయేరియాతో బుధవారం మృతి చెందిన బొజ్జమ్మ (65) కుటుంబాన్ని కెఆర్‌పురం ఐటిడిఎ పిఒ ఎం.సూర్యతేజ గురువారం పరామర్శించారు. గ్రామంలో ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంపును సందర్శించి ప్రతి ఒక్కరికీ మెరుగైన వైద్య సేవలందించాలని మెడికల్ ఆఫీసర్‌ను ఆదేశించారు. గ్రామంలో డయేరియా వ్యాప్తి చెందకుండా శానిటేషన్ మెరుగుపర్చాలని అధికారులను ఆదేశించారు. ఈ గ్రామంలో తాగునీరు ఏర్పాటు కోసం చేతిపంపును యుద్ధప్రాతిపదికన ఏర్పాటు చేయాలని ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులను ఆదేశించారు. మొత్తం గ్రామాన్ని అధికారులతో కలిసి పరిశీలించారు. గ్రామ ప్రజలందరూ పరిశుభ్రమైన ఆహారం, కాచి చల్లార్చిన తాగునీటిని తీసుకోవాలని గ్రామస్తులకు సూచించారు. గ్రామంలో ఎవరికైనా ఆరోగ్యపరమైన సమస్య వస్తే వెంటనే వైద్య శిబిరానికి వచ్చి వైద్య సేవలు పొందాలని విజ్ఞప్తి చేశారు. ఆయన వెంట డిఎంహెచ్ఒ డాక్టర్ ఎస్.శర్మిష్ఠ తదితరులు ఉన్నారు.

ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల సేవలు అభినందనీయం

సిఐ రవికుమార్

ఎన్ఎస్ఎస్ విభాగం వాలంటీర్లను అభినందిస్తున్నసిఐ, ఎస్ఐ

ప్రజాశక్తి - భీమడోలు

సార్వత్రిక ఎన్నికల సందర్భంగా భీమడోలు మండలంలో నిర్వహించిన ఎన్నికల ప్రక్రియ సందర్భంగా భీమడోలు శ్రీవెంకటేశ్వర డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం వాలంటీర్లు అందించిన సేవలు అభినందనీయమని భీమడోలు సిఐ బిబి.రవికుమార్ తెలిపారు. ఈ మేరకు కళాశాల ఆవరణలో గురువారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్లను సిఐతో పాటు భీమడోలు ఎస్ఐ సుధాకర్ తెలిపారు. వ్యక్తిగతంగా వారిని అభినందించారు. వారిని తీర్చిదిద్దిన కళాశాల యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల సందర్భంగా సేవలందించిన ఎన్ఎస్ఎస్ వాలంటీర్లకు ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత ఎస్‌సి, ఏలూరు డిఎస్‌పి ఆదేశాల మేరకు ప్రశంసాపత్రాలను అందించనున్నట్లు వారు తెలిపారు.

జాతీయ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం

బైక్‌ను వెనుక నుంచి ఢీకొన్న మరో బైక్

ఇద్దరు మృతి, ఇద్దరికి గాయాలు

ఘటన స్థలంలో రైల్వేఉద్యోగి మృతదేహం

ప్రజాశక్తి - భీమడోలు

గుండుగొలను-కొవ్వూరు జాతీయ రహదారిపై సూరప్పగూడెం రైల్వే ట్రాక్‌పై గల రోడ్డు ఓవర్ బ్రిడ్జిపై గురువారం మధ్యాహ్నం చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందగా, మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. చనిపోయిన వారిలో ఒకరు రైల్వే ఉద్యోగి కాగా, మరొకరు మంగళగిరికి చెందిన మహిళగా గుర్తించారు. 108 వాహన సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం... పలాస పట్టణానికి చెందిన బద్దె లోకేష్ భీమడోలు రైల్వే స్టేషన్‌లో రైల్వే ట్రాక్‌మెన్‌గా పని చేస్తున్నాడు. ఆయన తన మోటార్‌సైకిల్‌పై భీమడోలు నుంచి ఏలూరు వెళ్తుండగా వెనుక నుంచి ముగ్గురితో వస్తున్న మరొక మోటార్‌సైకిల్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో లోకేష్‌తో పాటు ఢీకొట్టిన ద్విచక్రవాహనంపై ప్రయాణిస్తున్న మంగళగిరికి చెందిన పఠాన్ నాగూర్ బీ(48) అక్కడికక్కడే మృతి చెందారు. అదే వాహనంపై ప్రయాణిస్తున్న తారక్‌బాబు, ఆయన సోదరి తీవ్ర గాయాలపాలయ్యారు. వీరు ద్వారకాతిరుమల నుంచి మంగళగిరి వెళ్తుండగా ప్రమాదం జరిగింది. సమాచారం తెలుసుకున్న 108 వాహనం సంఘటనా స్థలానికి చేరుకుంది. పైలెట్ సుబ్బారావు, ఇఎంటి .ఎం.ప్రసాద్ తీవ్ర గాయాలతో ఉన్న తారక్‌బాబు, ఆయన సోదరిలకు అత్యవసర చికిత్స అందించి ఏలూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

భీమడోలుకు పాఠ్య పుస్తకాలు

భీమడోలు హై స్కూల్లో పాఠ్యపుస్తకాలు

ప్రజాశక్తి - భీమడోలు

విద్యా కానుకలో భాగంగా భీమడోలు మండలానికి కేటాయించిన 8, 9, 10వ తరగతి పాఠ్యపుస్తకాలు వచ్చాయని, వాటిని భీమడోలు హై స్కూల్లో పంపిణీ కోసం భద్రపరిచామని మండల విద్యాధికారులు శ్రీనివాసరావు, భాస్కరకుమార్ తెలిపారు. దీనిలో భాగంగా 8వ తరగతికి చెందిన పది టైటిల్స్‌కు సంబంధించి 6,490 పాఠ్యపుస్తకాలు, తొమ్మిదో తరగతికి సంబంధించి 13 టైటిల్స్‌కు చెందిన 8,125 పాఠ్యపుస్తకాలు, పదో తరగతికి సంబంధించి 11 టైటిల్స్‌కు చెందిన 6,963 పాఠ్య పుస్తకాలు వచ్చాయన్నారు. రెండు రోజుల్లో 6, 7 తరగతులకు సంబంధించి పాఠ్యపుస్తకాలు రానున్నట్లు తెలిపారు. విద్యాకానుకలో భాగంగా ఇతర వస్తువులు రావాల్సి ఉన్నట్లు తెలిపారు. పాఠశాలలు తెరిచే సమయానికి పూర్తిస్థాయి విద్యా కానుకలను అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుందని తెలిపారు.

కొనసాగుతున్న వేసవి విజ్ఞాన శిబిరాలు

ప్రజాశక్తి - భీమడోలు

భీమడోలు శాఖ గ్రంథాలయంలో గ్రంథ పాలకులు కె.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కొనసాగుతున్న వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరంలో భాగంగా గురువారం విద్యార్థులకు విజ్ఞాన సంబంధిత అంశాలపై గ్రంథాలయంలో అందుబాటులో ఉన్న పుస్తకాల ద్వారా అందుబాటులో ఉన్న సేవల గురించి శిక్షణ తరగతులను రిసోర్స్ పర్సన్‌గా వ్యవహరిస్తున్న సామాజిక కార్యకర్త మండే సుధాకర్ వివరించారు. ఇదే క్రమంలో విద్యార్థులకు గ్రంథ పాలకుల ఆధ్వర్యంలో ఆటపాటలు నిర్వహించారు. చెస్ ఆట గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పలువురు విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

ర్యాలీ నిర్వహిస్తున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది, అధికారులు

డెంగీ పట్ల అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి - భీమడోలు

డెంగీ వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలని, దాని పట్ల ప్రతిఒక్కరికీ అవగాహన అవసరమని గుండుగొలను ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు ఆర్.జాహ్నవి తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో గురువారం జాతీయ డెంగీ నివారణ దినోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులతో పాటు ఆరోగ్య కేంద్రం సిబ్బంది పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్రం వైద్యులు మాట్లాడుతూ వైద్య ఆరోగ్య, కుటుంబ సంరక్షణ శాఖ ఆధ్వర్యంలో జాతీయ కీటక జనిత వ్యాధి నియంత్రణ కార్యక్రమంలో భాగంగా జాతీయ డెంగీ నివారణ దినోత్సవం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా వ్యాధి నివారణ, అది సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సమాజ భాగస్వామ్యం ఇతర అంశాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అధికారులు మల్లీశ్వరి, మురళీ, సిబ్బంది పాల్గొన్నారు.


ఇన్సినరేటర్‌ను అందిస్తున్న జనరల్ మేనేజర్ నాగమోహనరావు

పాఠశాలకు ఇన్సినరేటర్ వితరణ

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

దాతలు అందించిన సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలని తోటపల్లి ప్రీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు తాడిశెట్టి శోభన్‌బాబు అన్నారు. నున్న పవర్‌గ్రిడ్ యాజమాన్యం పాఠశాల ఉపాధ్యాయులు జి.అపర్ణ ప్రోద్బలంతో తోటపల్లి ప్రీ హైస్కూల్ విద్యార్థినులకు ఉపయోగపడేలా రూ.15 వేల విలువైన ఇన్సినరేటర్‌ను వితరణగా అందించారు. విద్యార్థినులు వినియోగించిన న్యాప్‌కిన్స్ ఎక్కడపడితే అక్కడ పడవేయకుండా ఈ ఇన్సినరేటర్‌లో వేస్తే అవి కాలిపోయి బూడిదగా మారతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పవర్‌గ్రిడ్ సీనియర్ మేనేజర్ కె.నాగమోహనరావు, డిప్యూటీ మేనేజర్ ఎం.శివనాగేశ్వరరావు, టెక్నీషియన్ కె.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్యంతో చెలగాటం

గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణంతో అవస్థలు
దుమ్ము, ధూళితో ఇబ్బందులు
శ్వాసకోశ, అలర్జి సమస్యలు
పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

మండలంలోని పొంగుటూరు, కన్నాయగూడెం గ్రామాల్లో రహదారి మార్గం అత్యంత దారుణమైన పరిస్థితిలో ఉంది. పక్కన ఉన్న తూర్పుగోదావరి జిల్లా యాదవోలు గ్రామం నుంచి యర్నగూడెం వరకు ఇదే పరిస్థితి. గ్రీన్ ఫీల్డ్ రహదారి నిర్మాణంలో భాగంగా పొంగుటూరు, కన్నాయగూడెం, యాదవోలు రెవెన్యూ గ్రామాల పంట పొలాల్లో నుంచి పొంగుటూరు, నిడదవోలు బైపాస్ మీదుగా ఈ నిర్మాణం సాగుతుంది. దాదాపుగా అన్ని గ్రామాల్లో భూసేకరణ అయిపోయి పనులు చురుగ్గా సాగుతున్నాయి. కన్నాయగూడెంలో కొంత భాగంలో పూర్తిగా పనులు నిలిచిపోయాయి. కొంతమంది రైతులు, వారి పంట పొలాలకు మార్కెట్ ధర కన్నా తక్కువ ఇస్తున్నారని, ప్రభుత్వంతో న్యాయ పోరాటం చేస్తున్నారు. కేసు కోర్టులో ఉండటంతో, గ్రీన్ ఫీల్డ్ అధికారులు అక్కడ పనులు పూర్తిగా నిలిపేశారు.

ఏదైతే రహదారి నిర్మాణం చేపట్టారో ఆ నిర్మాణం పక్కన వారికి వాహనాలు తిరగడానికి అప్రోచ్ రోడ్డు వంటిది ఏర్పాటు చేసుకుంటారు. నిర్మాణంలో కొంత భాగం భూమి అందుబాటులో లేకపోవడం వల్ల స్టేట్ హైవే పైనుంచి వారు నిర్మాణ పనులు సాగిస్తున్నారు. గ్రీన్ ఫీల్డ్ హైవే స్టాక్ పాయింట్ నుంచి కన్నాయగూడెం గ్రామం, పొంగుటూరు గ్రామం వరకు, దాదాపు ఆరు కిలోమీటర్లపైనే మట్టి లారీలు రాకపోకలు సాగిస్తున్నాయి. లారీల్లో జిగురు మట్టి తరలించడంతో అధిక వేగంతో లారీలు ప్రయాణించడంతో విరిగిన రాళ్లు, మట్టి కింద పడుతుంది. దుమ్ము అధికంగా వస్తుందని గ్రీన్ ఫీల్డ్ హైవే అధికారులకు ప్రజలు మొరపెట్టుకుంటే, వారు నీళ్ల ట్యాంకర్లతో రహదారిని తడుపుతున్నారు. ట్యాంకర్లతో తడుపుతున్న కారణంగా జిగురు మట్టి జారుడుగా మారి వాహనదారులకు ప్రమాద ఘంటికలుగా మారుతుంది. ఇదొక సమస్య అయితే రెండు రోజులకోసారి లేకపోతే, వారికి గుర్తొచ్చిన సమయంలో తడుపుతుండడంతో, బాగా హెవీ లారీలు రోడ్డు మీద అధిక వేగంతో వెళ్లడంతో దుమ్ము వాహనదారులపై, ప్రజలు నివాసం ఉంటున్న ఇళ్లపై పడుతుంది. అనేకనేక సమయాల్లో వాహనదారులు జారిపడి గాయాలైన సంఘటనలు, కోమాలోకి వెళ్లిన పరిస్థితులు కూడా ఏర్పడ్డాయి.

వేగంగా వెళ్తున్న లారీ, రోడ్డుపై లేచిన దుమ్ము


పంట చేలల్లోకి వెళ్తున్న దుమ్ము

ఏ రకంగా చూసినా గ్రామస్తులు నిత్యం నరకం అనుభవిస్తున్నారు. వేసవి సెలవులు కావడంతో పిల్లలు ఇంటి వద్ద ఉంటున్నారు. తల్లిదండ్రులు వారి పనుల్లో ఉన్నప్పుడు పిల్లలు బయటకు వచ్చి ఆడుకుంటున్న సమయంలో హెవీ వెహికల్స్ రోడ్డు మీద తిరగడంతో ప్రమాదాలకు గురయ్యే అవకాశాలు ఉన్నాయని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

బెదిరింపులకు దిగుతున్న అధికారులు

ఇదే విషయంపై ప్రజలు రోడ్ల మీదకు వచ్చి అనేక సందర్భాల్లో లారీలన్నీ ఆపేసి నిరసన వ్యక్తం చేశారు. అయినా అధికారులు పట్టించుకోవడంలేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తమ గోడు ఎవరూ పట్టించుకోవడంలేదని గ్రామస్తులు నిరాశకు గురవుతున్నారు.

గ్రీన్ ఫీల్డ్ అధికారుల నుంచి ఎవరి ముడుపులు వారికి అందాయని, అనుమతి లేకపోయినా విచ్చలవిడిగా కొండలు, గుట్టలు తొలగిస్తున్నా, పర్యావరణానికి చేటు కలిగిస్తున్నా నిమ్మకు నీరెత్తినట్లు ఉంటున్నారని, ఇంతటి ఘోర పరిస్థితులు ఎదుర్కొంటున్న కనీసం అధికారుల్లో ఎలాంటి చలనం లేదని విమర్శలు చేస్తున్నారు. ఎలక్షన్ కోడ్‌కు ముందు దాదాపుగా అన్ని గ్రామాల్లో రహదారులు వేయడానికి శంకుస్థాపనలు చేశారు. ప్రభుత్వ పెద్దలు పొంగుటూరు-నిడదవోలు రోడ్డు మాత్రం పట్టించుకున్న పాపాన పోలేదు. ఒకసారి రోడ్డు మంజూరైందంటారని, మరొకసారి గతంలో నిర్మించిన సంస్థ మెయింటెనెన్స్ చూసుకోవాలంటున్నాని ప్రజలు వాపోతున్నారు. ఏది నిజమో ఎవరికీ తెలియదు, అధికారులు సమాధానం చెప్పరని అంటున్నారు.

దుమ్ము, ధూళితో అలర్జీ

దుమ్ము, ధూళీ కారణంగా అలర్జీ, శ్వాసకోశ రోగుల సంఖ్య పెరగడం ప్రారంభమైంది. శ్వాస ఆడకపోవడం వల్ల కూర్చోవడం, పడుకోవడం కష్టమవుతుందని ప్రజలు వాపోతున్నారు. ఎప్పుడూ జలుబుగా ఉంటుందని, దురద, కళ్లు ఎరుపెక్కడం వటి సమస్యలు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సిలికోసిస్ బారిన పడతారు : వైద్యులు

విరిగిన రాళ్లు, దుమ్ము నుంచి సిలికా కణాలు, ధూళీ వల్ల సిలికోసిస్ వస్తుందని వైద్యులు చెబుతున్నారు. దుమ్ము శ్వాసతో ఊపిరితిత్తులకు వెళ్తుంది. వైద్యుల అభిప్రాయం ప్రకారం ఇది నయం చేయలేని వ్యాధి. ఊపిరితిత్తులపై సిలికా కణాల ప్రభావం ఊపిరితిత్తుల లోపలి ఉపరితలంపై గాయాలు, శ్వాసకోస ఇబ్బంది ఊపిరితిత్తుల బలహీనత, ఊపిరితిత్తుల పనితీరుపై ప్రభావం ఊపిరితిత్తుల క్షయవ్యాధి వంటి జబ్బులు వస్తాయని వైద్యులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

సంవత్సరం నుంచి ఇదే ప్రధాన సమస్య

విస్సాకోటి సతీష్, కన్నాయగూడెం

ఓవర్ లోడ్‌తో లారీలు అధిక వేగంలో వెళు న్నాయి. మట్టి గడ్డలు రహదారిపై పడి, దుమ్ముకు కారణమవుతున్నాయి. దుమ్ము, ధూళీ అధికంగా రావడంతో ప్రజల్లో శ్వాసకోశ సమస్యలు అధికమవుతున్నాయి. సంవత్సరం నుంచి ఇదే ప్రధాన సమస్యగా ఉంది. అధికార యంత్రాంగం చర్యలు తీసుకోవాలి. లేకపోతే ధర్నాకు దిగుతాము.

కళ్లల్లో రాషెష్ వస్తున్నాయి

గూడపాటి సతీష్, కన్నాయ గూడెం

ఐదేళ్ల నుంచి గతుకుల రోడ్డుతో చాలా ఇబ్బంది పడ్డాం. మళ్లీ ఇప్పుడు గ్రీన్ ఫీల్డ్ హైవే పనులు జరగడంతో లారీలు నిరంతరం తిరుగుతున్నాయి. చిన్నారులు రోడ్డుమీదకు వస్తున్నారు. ఎంత జాగ్రత్తగా చూసినా జరగరాని ప్రమాదం ఏదైనా జరిగితే ఎవరూ సమాధానం చెబుతారు. దుమ్ము, ధూళితో కళ్లల్లో రాషెష్ వస్తున్నాయి.

వెంటనే రహదారి నిర్మాణం చేపట్టాలి

నిమ్మగడ్డ కిషోర్, రైతు, కన్నాయగూడెం

సంవత్సరం కాలంగా గోతులను మట్టితో పూడ్చడం వల్ల దాని నుంచి వచ్చే దుమ్ము, ధూళీతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. లారీలు వేగంగా తిరగడంతో మట్టి గడ్డలు కింద పడి దుమ్ము లేస్తుంది. వర్షం వస్తే చాలా ఇబ్బందిగా ఉంటుంది. వెంటనే రహదారి నిర్మాణం చేపట్టాలి. లేకపోతే ధర్నాకు దిగుతాం.

అప్రోచ్ రోడ్డుపై దుమ్ము

పొట్లగట్లగూడెం గ్రామస్తుల అవస్థలు

జంగారెడ్డిగూడెం టౌన్ : మండలంలోని పొట్లగట్లగూడెం గ్రామ సమీపాన నిర్మాణం చేపడుతున్న గ్రీన్ ఫీల్డ్ హైవే రోడ్డు నిర్మాణంతో స్థానికులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దుమ్మి ధూళితో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. గ్రీన్ ఫీల్డ్ అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడంలేదని గ్రామస్తులు వాపోతున్నారు. ప్రతిరోజు వేల సంఖ్యలో ప్రజలు ఈ రోడ్డుమార్గంలో ప్రయాణాలు సాగిస్తూ ఉంటారు. ఇక్కడ స్పిల్ వే వంతెన నిర్మాణం కోసం, దారి మళ్లించారని, ఆ దారిలో దుమ్ము, ధూళీతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

దారి కనిపించక ప్రమాదాలు

రోడ్డుపై ప్రయాణించేటప్పుడు దుమ్ము లేచి దారి కనిపించక వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు,. కనీసం దుమ్ము లేగకుండా నీళ్లు కూడా చల్లకుండా గ్రీన్ ఫీల్డ్ అధికారులు చోద్యం చూస్తూ ప్రజల ఆరోగ్యాలతో చెలగాటమాడుతున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్పిల్ వే వంతెన నిర్మాణ పనులు నత్త నడకన సాగుతున్నాయి. వంతెన నిర్మాణ పనులు చేసేటప్పుడు వచ్చే సౌండ్స్ వల్ల ఆ రోడ్డు మార్గంలో ప్రయాణించేవారు భయాందోళనకు గురవుతున్నారు. అంతేకాకుండా దుమ్ము రోడ్డు పక్కన పంట చేలల్లోకి వెళ్లడంతో పంట పాడవుతుందని రైతులు వాపోతున్నారు. స్పిల్ వే వంతెన పనులు త్వరితగతన పూర్తి చేయాలని, దుమ్ము, ధూళి వల్ల ప్రజల ఆరోగ్యం పాడవకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. వంతెన నిర్మాణం కోసం పక్కకు మళ్లించిన దారి గుంతలమయంగా ఉంది. దీంతో ప్రయాణికులు, వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇబ్బందుల్లేకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

అక్రమాలు అరికట్టడంలో ఎన్నికల అధికారులు విఫలం

సిపిఎం మండల కన్వీనర్ రమణారావు

ప్రజాశక్తి - నిడమర్రు

అవినీతిని అరికట్టడంతో ఎన్నికల అధికారులు విఫలమయ్యారని సిపిఎం మండల కన్వీనర్ నారపల్లి రమణారావు అన్నారు. నిడమర్రులో ప్రజాసంఘాల కార్యాలయంలో కోన శ్రీనివాసరావు అధ్యక్షతన గురువారం నిర్వహించిన సిపిఎం మండల కమిటీ సమావేశంల. సిపిఎం మండల కన్వీనర్ నారపల్లి రమణారావు మాట్లాడారు. గతంలో రాజకీయ పార్టీలు ఓటర్లకు అర్ధరాత్రి డబ్బులు పంపిణీ చేసేవారన్నారు. కాని నేడు అభివృద్ధిని చూసి ఓట్లు వేయాలని వైసిపి, అవినీతి ప్రభుత్వాన్ని గద్దె దింపాలని టిడిపి కూటమి ఒకరిపై ఒకరు పోటీపడి మరీ పట్ట పగలు ఓటర్లకు డబ్బులు పంపిణీ చేశారన్నారు. డబ్బులు పంపిణీ చేస్తుంటే ఎన్నికల అధికారులు చోద్యం చూస్తున్నారన్నారు. ఈ నెల 13వ తేదీన సార్వత్రిక ఎన్నికలను సక్రమంగా నిర్వహించడం కోసం నియమించిన ఎన్నికల అధికారులు అవినీతిని అరికట్టడంలో విఫలమయ్యారన్నారు. ఇటీవల ఎన్నికల విధుల్లో మరణించిన అంగన్‌వాడీ వర్కర్ సుభాషిని, వామ పక్ష నాయకులకు సంతాపం తెలిపారు. ఈ సమావేశం లో గవర సత్యనారాయణ, వెలగలేటి మోహన, కంచం వరప్రసాద్, లావేటి చంద్రరావు, కానూరు రాజా పాల్గొన్నారు.

వాయిదా పడిన గ్రామ సభలను నిర్వహించాలి

ప్రజాశక్తి - మండవల్లి

వాయిదాపడిన గ్రామ సభలను నిర్వహించి గ్రామాభివృద్ధి కుంటు పడకుండా చూడాలని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక సభ్యులు ఎల్ఎస్.భాస్కరరావు కోరారు. స్థానిక గ్రంథాలయం వద్ద గురువారం ఆయన మాట్లాడారు. సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఏప్రిల్ 14న జరగాల్సిన గ్రామ సభలను అధికారులు వాయిదా వేశారన్నారు. ఎన్నికల నిబంధనలకు లోబడి గ్రామ సభలను షెడ్యూల్ ప్రకారం నిర్వహించాల్సి ఉండగా ఒకటి రెండు జిల్లాల్లో మాత్రమే నిర్వహించినట్లు తెలుస్తుందన్నారు. మండవల్లి మండలంలో కూడా గ్రామ సభలను నిర్వహించలేదన్నారు. గ్రామ పాలనలో ప్రజలు ప్రత్యక్షంగా పాల్గొనే అవకాశం ఉన్న గ్రామసభలు గ్రామాభివృద్ధికి, మౌలిక వసతుల ఏర్పాటుకు, సమస్యల పరిష్కారానికి ఎంతో దోహదపడతాయన్నారు. గ్రామ సభలను నిర్వహించేలా చూడాలని ఆయన కోరారు. అంతేకాకుండా ఈ గ్రామసభలో ప్రధానంగా గత ఆర్థిక సంవత్సరంలో అమలైన కార్యక్రమాలు, చేపట్టిన పనులను ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో చేపట్టాల్సిన పనులు, గ్రామపంచాయతీ జమ ఖర్చుల వివరాలు, భౌతిక సామాజిక తనిఖీ గ్రామ సభ నివేదికలు ప్రస్తుత సంవత్సరిక కార్యాచరణ ప్రణాళిక, బడ్జెట్, తదితర అంశాలపై ఈ గ్రామసభలో చర్చించాల్సి ఉందన్నారు. అధికారులు తక్షణమే స్పందించి గ్రామాభివృద్ధికి మూలమైన గ్రామసభలను నిర్వహించేలా షెడ్యూల్‌ను వెంటనే విడుదల చేసి గ్రామ సభలను నిర్వహించాలన్నారు. సభల నిర్వహణ తీరును ఆడియో వీడియోలు తీయించి సంబంధిత వెబ్‌సైట్‌లో పౌరులకు అందుబాటులో ఉంచేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక మండల శాఖ అధ్యక్షులు టి.అప్పారావు పాల్గొన్నారు.

'సార్వత్రిక ఎన్నికల్లో వైసిపిదే విజయం'

ప్రజాశక్తి - ఉంగుటూరు

సార్వత్రిక ఎన్నికల్లో విజయం వైసిపిదేనని ఉంగుటూరు ఎంపిపి గంటా శ్రీలక్ష్మి, పార్టీ మండల కన్వీనర్ మంగారావు గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా మరోసారి బాధ్యతలు చేపడతారన్నారు. ఉంగుటూరు నియోజకవర్గంలో ఎంఎల్ఎగా పుప్పాల వాసుబాబు గెలుపొందటం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఎన్నికల్లో వైసిపి విజయానికి ప్రచారం చేసిన ప్రతిఒక్కరికీ ధన్యవాదాలు తెలుపుతున్నామని చెప్పారు. సిఎం వైఎస్.జగన్మోహన్‌రెడ్డి పేద, బడుగు, బలహీన తరగతులకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారన్నారు. వాటిని తిరిగి పొందేందుకు ప్రతిఒక్కరూ వైసిపికి ఓట్లు వేశారన్నారు. ఎన్నికల్లో ఎస్‌సి, ఎస్‌టి, మైనారిటీలు వైసిపి వైపు ఉన్నారన్నారు.

నేరాలు - ఘోరాలు

రేషన్ దుకాణాలపై విజిలెన్స్ దాడులు

ప్రజాశక్తి - భీమడోలు

మండలంలోని గుండుగొలను గ్రామంలో రేషన్ షాపులపై విజిలెన్స్ అధికారులు గురువారం దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఒక రేషన్ షాపులో లెక్కకు మించి రేషన్ సరుకులు ఉన్నట్లు గుర్తించారు. డీలర్‌పై నిత్యావసర వస్తువుల చట్టం కింద కేసు నమోదు చేసినట్లు భీమడోలు సిఎస్ డిటి వి.ఎ.మాధవరావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. గుండుగొలనులోని ఒక రేషన్ షాపులో లెక్కకు మించి రేషన్ సరుకులు నిల్వ ఉన్నట్లు సమాచారం మేరకు విజిలెన్స్ సిఐ రంజిత్ కుమార్ భీమడోలు సిఎస్‌డిటితో కలిసి గురువారం సంయుక్తంగా దాడులు నిర్వహించారు. తనిఖీ సమయంలో 122 కేజీల బియ్యం, ఏడు ప్యాకెట్ల పంచదార, 17 ప్యాకెట్ల గోధుమపిండి ఉన్నట్లు గుర్తించారు. డీలర్‌పై కేసు నమోదు చేశారు. ఈ కార్యక్రమంలో గుండుగొలను గ్రామ రెవెన్యూ అధికారి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

హత్య కేసులో వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి - టి.నరసాపురం

వివాహేతర సంబంధం నేపథ్యంలో చోటు చేసుకున్న ఘటనలో వ్యక్తిపై దాడి చేసి హత్య చేసిన కేసులో వ్యక్తిని అరెస్టు చేసినట్లు జీలుగుమిల్లి సిఐ టి.క్రాంతికుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. టి.నరసాపురం పంచాయతీలోని తూర్పుగూడెం గ్రామానికి చెందిన రావుల వీరస్వామి భార్య నాగమణితో మండలంలోని తూర్పుగూడెనికి చెందిన పెనసనగంటి మంగయ్య అలియాస్ మంగరాజు కొంతకాలంగా వివాహేతర సంబంధం కలిగి ఉన్న విషయం భర్త వీరస్వామికి తెలిసింది. దీంతో అతని అడ్డు తొలగించుకునే ఉద్దేశంతో ఈ నెల 12వ తేదీ సాయంత్రం తూర్పుగూడెం శివారులోని శ్మశాన సమీపంలోని పామాయిల్ తోటలోకి వీరస్వామిని తీసుకెళ్లి మద్యం పోయించిన మంగయ్య గొడవపడి వీరస్వామిని కత్తితో పొడిచి చంపాడు. వీరస్వామిని గ్రామస్తులు, కుటుంబ సభ్యులు చింతలపూడి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారంతో టి.నరసాపురం ఎస్ఐ డి.దుర్గామహేశ్వరరావు కేసు నమోదు చేశారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వీరస్వామి ఈ నెల 12వ తేదీ రాత్రి మృతి చెందాడు. హత్య కేసులో విచారణ చేపట్టిన పోలీసులు మంగరాజును తూర్పుగూడెంలోని అతని ఇంటి వద్ద గురువారం అరెస్టు చేసి చింతలపూడి కోర్టులో హాజరు పరచగా జడ్జి 14 రోజుల రిమాండ్ విధించినట్లు సిఐ క్రాంతికుమార్ తెలిపారు.

కుమార్తె కన్పించడంలేదని ఫిర్యాదు

ప్రజాశక్తి - ముసునూరు

తన కుమార్తె కనిపించడంలేదని ఓ తండ్రి ముసునూరు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఎస్ఐ పి.వాసు తెలిపిన వివరాల ప్రకారం... ముసునూరు మండలం వేల్పుచర్ల గ్రామానికి చెందిన నాగభూషణం తన కుమార్తె ఈ నెల 12వ తేదీ నుంచి కనిపించడంలేదని ఫిర్యాదు చేశాడు. తన కుమార్తె 19 సంవత్సరాలని, 12వ తేదీ నుంచి కనిపించకపోవడంతో తమ బంధువుల ఇళ్ల వద్ద, సమీప గ్రామ బంధువుల ఇళ్ల వద్ద వెతికినా ఆచూకీ లభ్యం కాలేదని చెప్పారు. దీంతో తండ్రి నాగభూషణం గురువారం ముసునూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఆయన ఫిర్యాదు మేరకు ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

డివైడర్‌ను ఢీకొన్న కారు
ఏడుగురికి గాయాలు

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

కారు డివైడర్‌ను ఢీ కొని ఏడుగురు గాయాలపాలయ్యారు. ఆ ఘటన చెక్‌పోస్ట్ సమీపంలో గురువారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... విశాఖ జిల్లా నర్సీపట్నం ప్రాంతానికి చెందిన ఏడుగురు కుటుంబ సభ్యులు నర్సీపట్నం నుంచి విజయవాడ కనకదుర్గమ్మ దర్శనానికి బుధవారం రాత్రి బయలుదేరి వెళ్లారు. తిరిగి గురువారం నర్సీపట్నం బయలుదేరారు. ఈ క్రమంలో చెక్‌పోస్ట్ సమీపానికి వచ్చేసరికి డ్రైవర్ నిద్ర మత్తులో డివైడర్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో డ్రైవర్‌తో సహ ఏడుగురు గాయాలపాలయ్యారు. వీరిలో ఒక మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వారిని ఆశ్రం ఆసుపత్రికి తరలించగా అక్కడినుండి ఏలూరు సర్వజన ఆసుపత్రికి తరలించారు.

మాజీ సర్పంచి కృష్ణమూర్తి మృతి

ప్రజాశక్తి - కలిదిండి

మండలంలోని మట్టగుంట గ్రామ మాజీ సర్పంచి అంద్రాజు కృష్ణమూర్తి (69) గుండెపోటుతో మృతి చెందారు. నాలుగు దశాబ్దాలుగా రాజకీయాల్లో తనదైన శైలిలో చెరగని ముద్ర వేశారు. మూడు పర్యాయాలు మట్టగుంట గ్రామ సర్పంచిగా పని చేయడంతో మాజీ సర్పంచి అంద్రాజు కృష్ణమూర్తిగా మండల స్థాయిలో సుపరిచితులు. ఆయన పిఎసిఎస్ అధ్యక్షునిగానూ పని చేశారు. టిడిపి సీనియర్ నాయకునిగా పార్టీకి విశేష సేవలందించారని నాయకులన్నారు. ఆయన మృతి పార్టీకి తీరని లోటన్నారు. ఆయనకు భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు. మట్టగుంటలోని ఆయన స్వగృహం వద్ద ఆయన మృతదేహాన్ని టిడిపి రాష్ట్ర బిసి సెల్ కార్యదర్శి అంద్రాజు శ్రీనివాసరావు, ఎఎంసి ఛైర్మన్ కొల్లాటి సత్యనారాయణ, జెడ్‌పిటిసి మాజీ సభ్యులు ఒడుగు తులసీరావు, నాయకులు నాగిడి వీర బ్రహ్మం, సంగాని గంగాధరరావు, పామర్తి సత్యనారాయణ, మంతెన సుబ్బరాజు, దున్న భోగేశ్వరరావు, వేగిరెడ్డి సత్యనారాయణ, తిరుమాని పాండురంగారావు, పరిసర గ్రామాల ప్రజలు సందర్శించి నివాళు లర్పించారు. కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. కృష్ణమూర్తి మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.


కృష్ణమూర్తి (ఫైల్‌ఫొటో)

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి - ప్రజాశక్తి - ఏలూరు

ఈ నెల 17వ తేదీ శుక్రవారం ఏలూరు ఒకటో పట్టణంలోని వెంకన్న ట్యాంక్ సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్ల దగ్గరగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు, విద్యుత్ లైన్ల వార్షిక మరమ్మతుల నిమిత్తం ఉదయం ఏడు గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఎపిఇపిడిసిఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు (ఏలూరు డివిజన్) జెపిబి.నటరాజన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమయంలో వెంకన్న ట్యాంక్ సబ్ స్టేషన్ పరిధిలోని కొత్తగూడెం సెంటర్, ఏడు కాలవల సెంటర్, చాటపర్రు రోడ్, తూర్పు వీధి సాయి బాబా ఆలయం సెంటర్, తూర్పు వీధి గంగానమ్మ ఆలయం ఏరియా, వీవర్స్ కాలనీ, తూర్పు వీధి, ఫిల్ హౌస్ పేట, మాదేపల్లి రోడ్, పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

జీలుగుమిల్లి : మండలంలోని పి.నారాయణపురం సబ్‌స్టేషన్ నుంచి 33/11 కెవి రాచన్నగూడెం సబ్ స్టేషన్ల మధ్య ఉన్న 33 కెవి హైటెన్షన్ లైన్ పైన చెట్టు కొమ్మలు నరకడం, ఇతర మరమ్మతుల దృష్ట్యా ఈ నెల 17వ తేదీ శుక్రవారం ఉదయం ఏడు గంటల నుంచి పది గంటల వరకు జీలుగుమిల్లి మండలంలోని రాచన్నగూడెం సబ్ స్టేషన్ల పరిధిలోని ఆయా గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్లు జంగారెడ్డిగూడెం డివిజనల్ విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పి.రాధాకృష్ణ తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

ధాన్యం బకాయిల సొమ్ము చెల్లించాలి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

రబీ ధాన్యం బకాయి సొమ్ములు రైతులకు, కౌలు రైతులకు వెంటనే చెల్లించాలని ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఏలూరు పవర్‌పేట అన్నే భవనంలో గురువారం నిర్వహిం చిన రైతుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రబీ ధాన్యం బకాయి సొమ్ములను చెల్లించకపో వడం వల్ల అన్నదాతలు ఇబ్బందులు పడుతునా ్నరని ఆందోళన వ్యక్తం చేశారు. పంట సాగుకు చేసిన అప్పులు తీర్చలేక అష్ట కష్టాలు పడాల్సి వస్తోందన్నారు. ధాన్యం బకాయి సొమ్ముల నిధులను విడుదల చేసి రైతులు, కౌలు రైతుల బ్యాంకు ఖాతాలకు జమ చేసి ఆదుకోవాలని కోరారు. వాతావరణం మారి వర్షాలు పడుతున్న నేపథ్యంలో కల్లాల్లో ఉన్న ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. 21 రోజుల నిబంధనతో నిమిత్తం లేకుండా ధాన్యం సొమ్ములను వెంటనే చెల్లించాలని కోరారు.

KVB Karur Vysya Bank
Smart way to bank
ది కరూర్ వైశ్యా బ్యాంక్ లిమిటెడ్
డోర్ నెం. 22-15-21, M.R.O. ఆఫీస్ ఎదురుగా, భీమవరం-1 ఫోన్: 233652

బంగారు ఆభరణములు బహిరంగ వేలము ప్రకటన

ఈ దిగువ తెలిపిన నగలను బ్యాంకువారు బహిరంగ వేలం ద్వారా వేలం వేయ నిర్ణయించినారు. కావున తెలియజేయడమైనది.

వేలం జరుగు తేది : 30-05-2024, సాయంత్రం 4:00 గం.కు

వ నెం.	అకౌంట్ నెం.	ఖాతాదారుని పేరు మరియు చిరునామా	బంగారం బరువు గ్రా॥లలో
1.	1431952000033851 1431953000037855 1431953000037870 1431953000037886	కొట్టు సత్యనారాయణ డోర్ నెం. 19-24/1 రెడ్డి కాలనీ, బ్యాంక్ కాలనీ దగ్గర, శ్రీకృష్ణ దేవరాయ కళ్యాణ మండపం - 534 202, భీమవరం, పశ్చిమ గోదావరి జిల్లా, ఆంధ్రప్రదేశ్	88.20 135.80 112.80 178.90

ముఖ్య నియమ నిబంధనలు : 1. పైన తెలిపిన ఋణ గ్రహీతలకు గతంలో జారీ చేసిన నోటీసులకు (అవి అందినను లేక ఏ కారణం చేతనైనను తిరిగివచ్చినను) దీనినే ఆఖరి నోటీసుగా భావించవలసినదిగా. 2. ఒక వేళ ఋణ గ్రహీత మరణించినచో వారి వారసులకు కూడా ఈ ప్రకటన ద్వారా తెలియజేయడమైనది. 3. వేలం నందు పాల్గొనదలచినవారు రూ. 10,000/- ధరావత్తు ది. 30-05-2024 మధ్యాహ్నం గం.2:00 గంటల లోగా బ్యాంకు నందు జమచేసి రిజిష్టర్ చేసికొనవలయును. ధరావత్తు చెల్లించిన వక్తిని మాత్రమే ఆక్షను హాలులోకి అనుమతించబడును. 4. విజయవంతమైన ఆపాటదారుడు వేలం తేది సాయంత్రం 4:00 గం.లోగా ధరావత్తు మినహా మిగిలిన పాట మొత్తమును చెల్లించి నగలను స్వంత బాధ్యత వహించి పొందవలెను. 5. నగల నాణ్యతను పాటకు ముందుగానే పాటదారుడు సరిచూసుకొనవలెను. అందుకు బ్యాంకు బాధ్యత వహించజాలదు. 6. ఏ విధమైన ముందస్తు ప్రకటన లేకుండగానే వేలమును పాక్షికంగా గాని, పూర్తిగా గాని రద్దుచేయు అధికారం బ్యాంకుకు కలదు. 7. పాటదారుడు సరైన ఫోటో మరియు చిరునామా రుజువులను ప్రాథమికంగా దాఖలు చేయుట తప్పనిసరి. 8. ఇతర పూర్తి నియమ నిబంధనల కొరకు బ్రాంచి నందు సంప్రదించగలరు.

భీమవరం తేది: 16-05-2024 సం/- బ్రాంచ్ మేనేజర్

CHANGE OF NAME

I, **INGALLA JYOTHIRMAI,** W/o. **Ingalla Lakshmoji** and Residing at D.No. 9-44/A, Gandhi Nagar, Kovvali, Denduluru Mandal, Eluru, Andhra Pradesh, Ph: 9985811439 Changing My Name from **INGALLA JYOTHIRMAI** (Old Name) to **INAGALLA JYOTHIRMAI** (New Name), W/o. **Inagalla Lakshmoji.** Hence forth I am being called as **INAGALLA JYOTHIRMAI** (New Name). For all purpose.

దావా సమను

మహారాజశ్రీ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో, పాలకొల్లు

O.S. No. 240/2023

బిట్వీన్:
మేడపాటి వెంకట సత్యనారాయణరెడ్డి -వాది
Vs
కలిసిపూడి సుధాకర్ & 4 ఇతరులు -ప్రతివాదులు

To:
3వ ప్రతివాది: మంతెన వెంకట వరప్రసాద్, S/o. చంద్రరావు, డోర్ నెం. 6-80, రాయకుదురు, వీరవాసరం మండలం, ప॥గో॥జిల్లా.

పై నెంబరు దావాలో 3వ ప్రతివాది హాజరు నిమిత్తం శ్రీ కోర్టు వారు పై నెంబరు దావాను ది. 2-7-2024 కు వాయిదా వేసినారు. కాబట్టి 3వ ప్రతివాది పై నెంబరు దావాలో ది. **2-7-2024వ తేదీన ఉదయం 10.30 ని॥లకు** స్వయంగా గాని, న్యాయవాది ద్వారా గాని శ్రీ కోర్టు వారు ఎదుట హాజరు కావలెను. అట్లు హాజరు కానిచో 3వ ప్రతివాది పరోక్షమందు పై నెంబరు దావాను శ్రీ కోర్టు వారు తీర్మానించెదరు తెల్పడమైనది.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

ఎం.వెంకట రామారెడ్డి
పాలకొల్లు అడ్వకేటు
తేది: 17-05-2024 సెల్:9440110677

నోటీసు

మహారాజశ్రీ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో, పాలకొల్లు

I.A. No. 618/2023
O.S. No. 240/2023

బిట్వీన్:
మేడపాటి వెంకట సత్యనారాయణరెడ్డి -పిటీషనర్/వాది
Vs
కలిసిపూడి సుధాకర్ & 4 ఇతరులు -రెస్పాండెంట్లు/ ప్రతివాదులు

To:
3వ రెస్పాండెంట్: మంతెన వెంకట వరప్రసాద్, S/o. చంద్రరావు, డోర్ నెం. 6-80, రాయకుదురు, వీరవాసరం మండలం, ప॥గో॥జిల్లా.

పై నెంబరు పిటీషనులో 3వ రెస్పాండెంట్ హాజరు నిమిత్తం శ్రీ కోర్టు వారు పై నెంబరు పిటీషను ది. 2-7-2024 కు వాయిదా వేసినారు. కాబట్టి 3వ రెస్పాండెంట్ పై నెంబరు పిటీషనులో ది. **2-7-2024వ తేదీన ఉదయం 10.30 ని॥లకు** స్వయంగా గాని, న్యాయవాది ద్వారా గాని శ్రీ కోర్టు వారు ఎదుట హాజరు కావలెను. అట్లు హాజరు కానిచో 3వ రెస్పాండెంట్ పరోక్షమందు పై నెంబరు పిటీషను శ్రీ కోర్టు వారు తీర్మానించెదరు తెల్పడమైనది.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

ఎం.వెంకట రామారెడ్డి
పాలకొల్లు అడ్వకేటు
తేది: 17-05-2024 సెల్:9440110677

In the Court of Spl. Judicial Ist Class Magistrate for Exice Court, Eluru, W.G.Dist.,

O.S. 68/2021

Between:
Moru Yuva Raju ***...Plaintiff***
&
1. Bale Prabhakara Rao
Bale Avva Mani ***...Defendants***

పై నంబరు గ్రంథంలో ***D-1:*** Bale Prabhakara Rao, S/o. Sowbhagya Rao, R/o. D.No. 73-9, Gudivaka Lanka Village, Eluru Mandal.
D-2: Bale Avva Mani, W/o. Prabhakara Rao, D.No. 73-9, Gudivaka Lanka, Eluru Mandal.

అను వారికి నోటీసులు అమలు కొరకు ది. 21-6-2024 వాయిదా అయివున్నది. సదరు వాయిదా రోజు ఉదయం 10.30 ని॥లకు పై కోర్టు వారి ఎదుట స్వయముగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని వచ్చి మీ ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేని యెడల వారి పరోక్షమందు సంగతులు తీర్మానించెదరు.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వులు ప్రకారం)

యర్రా సురేష్, అడ్వకేట్
ఏలూరు, సెల్: 9490433134

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్కులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్కులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814